హైకోర్టు ప్లీడర్ శ్రీనివాసులు గౌడ్‌కు సన్మానం


శ్రీనివాసులు గౌడ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: లాలాపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్ఎల్ శ్రీనివాసులు గౌడ్ ఇటీవల హైకోర్టు ప్లీడర్‌గా నియమితులయ్యారు. దీంతో లాలాపేటలోని మంజరీ నర్సింగ్ హోమ్ వద్ద బుధవారం ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ సంఘ సంస్కర్త, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాసులు గౌడ్ దంపతులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు లాలాపేటవాసులు సైతం విశేష్ చెప్పారు.

సత్కారం


వీసీ ప్రొ.సూర్యధనుంజయ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొ.సూర్య ధనుంజయ్‌ను బుధవారం ఓయూలో ఘనంగా సన్మానించారు. ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ విభాగంలో జరిగిన తెలుగు భాష శాస్త్రల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనను అధ్యాపకులు హెడ్ డా.సీఎస్ స్వాతి, డా.కల్లోజి సుశీల్, బాలు నాయక్ తదితరులు సన్మానించారు.

రేషన్‌కార్డు నిబంధన ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

అడ్డగుట్ట: 'రాజీవ్ యువ వికాసం' పథకానికి రేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని సికింద్రాబాద్ సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. అడ్డగుట్టలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనేక మంది అర్హులు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు పెట్టుకున్నా ఇంకా మంజూరు కాలేవన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో నడిచి సబ్సిడీ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడం అన్యాయమని పేర్కొన్నారు. యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే తక్షణమే అర్హులందరికీ రేషన్ కార్డులు యుద్ధ ప్రాతిపదికన అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఓయూలో విద్యార్థి నేతల ముందస్తు అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక సందర్భంగా ఓయూలో పలువురు విద్యార్థులను ముందస్తు అరెస్టు చేశారు. బుధవారం తెల్లవారు జామునే ఎన్ఆర్ఎస్ హాస్టల్‌లో ఉంటున్న పీహెచ్‌డీ విద్యార్థి, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, ఆసీఫ్, నవీన్, ఉప్పర ఉదయ్, వారాసీగూడలో నివాసం ఉంటున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తిని ఓయూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎలాంటి ఆందోళనలు చేపట్టకున్నా ప్రశాంతంగా ఉన్న క్యాంపస్‌లో విద్యార్థి నేతలను అరెస్ట్ చేయడాన్ని వివిధ వామపక్ష విద్యార్థి నాయకులు తీవ్రంగా ఖండించారు.

బీఆర్ఎస్ నాయకులు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజిక్స్ విభాగంలో బుధవారం సదస్సు ముగిసిన అనంతరం తిరిగి వెళ్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఓయూ లేడీస్ హాస్టల్ సమస్యలపై వినతి పత్రం అందించేందుకు ప్రయత్నించిన పలువురు బీఆర్ఎస్ నేతలు, విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేసి లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.వారిలో బీఆర్ఎస్ యువ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు, ఓయూ పూర్వ విద్యార్థి నేత డా.సత్యవతి, విద్యార్థిని అస్మా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గౌతం ప్రసాద్ ఉన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23 బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 18, క్యాప్సికం 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 18, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 21, ఆలుగడ్డ 21, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర


గాంధీలో శిక్షణ తరగతులకు హాజరైన వైద్యులు

గాంధీఆస్పత్రి: వైద్య విద్య బోధనలో వృత్తి నైపుణ్యాలు మరింత మెరుగుపర్చుకోవాలని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి సూచించారు. గాంధీ మెడికల్ కాలేజీ రీజినల్ ట్రైనింగ్ సెంటర్‌లో 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' శిక్షణ రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఇందిర మాట్లాడుతూ.. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు తెలంగాణలోని 60 మెడికల్ కాలేజీలను 3 రీజియన్స్‌గా విభజించారని, గాంధీ మెడికల్ కాలేజీ ఓ రీజినల్ కేంద్రంగా కొనసాగుతుందన్నారు. దీని పరిధిలోని 25 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల సీనియర్ వైద్యులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గాంధీ రీజనల్ సెంటర్ కన్వీనర్ ప్రొఫెసర్ కిరణ్ మాదల, కోకన్వీనర్ సుభోద్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, ఆయా మెడికల్ కాలేజీల సీనియర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

'మహాత్మా గాంధీ, అంబేడ్కర్‌ను అవమానిస్తున్న బీజేపీ'


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించేలా బీజేపీ వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్'లో భాగంగా సిఖ్‌విలేజ్‌లోని గాయత్రీ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగేతర చర్యలకు పాల్పడుతున్న బీజేపీని ఎదుర్కొనేందుకు ఏఐసీసీ పిలుపు మేరకు ప్రతి నియోజకవర్గంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేస్తున్నామన్నారు. బీజేపీ ఢిల్లీ నుంచి గల్లీ వరకు స్వార్థపూరితంగా మత రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతోందని, ఆ పార్టీ వలలో పడకుండా దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమానికి హాజరైన వారు బాపు స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జై బాపు జై భీం జై సంవిధాన్ అభియాన్ కంటోన్మెంట్ కోఆర్డినేటర్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బల్వంత్ రెడ్డి, మురళి, నరేశ్, బంగారు సదానంద్, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంత రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఆధునిక వైద్య సేవలు షురూ


మాట్లాడుతున్న చంద్రశేఖర్, అనిరుధ్‌కుమార్ పురోహిత్

సనత్‌నగర్: దేశంలోనే మొదటిసారిగా బేగంపేటలో ఏర్పాటైన అనంత రిహాబిలిటేషన్ సెంటర్ మరో అడుగు ముందడుగు వేసింది. అడ్వాన్స్ త్రీడీ గేయిట్ ఎనాలసిస్ అండ్ త్రీడీ పోశ్చర్ ఎనాలసిస్, స్పాస్టిసిటీ, అనంత స్పెషాలిటీ క్లినిక్, పీడియాట్రిక్ ఆర్థో అండ్ న్యూరో రిహాబిలిటేషన్ సేవలను అందుబాటులోకి తీసుకురాగా సీనియర్ కన్సల్టెంట్ న్యూరో, స్పైన్ సర్జన్ డాక్టర్ అనిరుధ్‌కుమార్ పురోహిత్, అనంత రిహాబిలిటేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ సెంటర్‌లో 24 గంటల పాటు క్రిటికల్ కేర్, వెంటిలేటర్, డయాలసిస్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లు ఎక్కడా లేవని, నిపుణులైన స్పెషలిస్టులు, వైద్యుల పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఈ రిహబ్ పేషెంట్లు త్వరగా కోలుకునేలా చేయడంలో ముందుంద న్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ పెయిన్ మేనేజ్‌మెంట్ అండ్ అనస్తీసియాలజీ డాక్టర్ అనూష కారుమూరి, వైద్యులు సచ్చిదానందరావు, ఆనంద్, కిశోర్, నాగచైతన్య, పవన్‌కుమార్ సద్వానీ, శివరంజని సంతోష్, తరుణ్ పాల్గొన్నారు.

'తప్పుల తడకగా ఏక సభ్య కమిషన్ నివేదిక'

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం నియమించిన ఏక సభ్య కమిషన్ రిపోర్టు తప్పుల తడకగా ఉందని పలువురు మాల నేతలు ధ్వజమెత్తారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాల్‌లో మాల స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడు మాదాసు రాహుల్ ఆధ్వర్యంలో 'జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌లో తప్పులు, ఎస్సీ వర్గీకరణ జరిగిన తీరులో లోపాలు' అనే అంశం పై బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో మందాల భాస్కర్, నారాయణ, రత్నం, ప్రొ.సొడ నవీన్, మాయాదేవి, నమ్రత, డా.వెంకటేశ్వర్లు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారమే ధ్యేయంగా పనిచేయాలి


రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు, కార్యకర్తలతో మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి సూచించారు. సనత్‌నగర్ నియోజకవర్గం రాంగోపాల్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా మాజీ కార్పొరేటర్ భవర్‌లాల్‌వర్మ కుమారుడు సందీప్‌వర్మను పార్టీ అధిష్టానం ఇటీవల ప్రకటించింది. ఆ మేరకు డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందీప్‌వర్మ బుధవారం మర్రి శశిధర్‌రెడ్డిని కలిసి స్థానికంగా ఉన్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీకి కార్యకర్తలే బలమని, స్థానికంగా ఉన్న సమస్యలపై పోరాడి పరిష్కారానికి చొరవ తీసుకున్నప్పుడే ప్రజల్లో విశ్వాసం చూరగొంటామని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, ఆకుల ప్రతాప్, బీరం నర్సింగ్‌రావు, ఆనంద్‌రావు, రవికుమార్, విష్ణు, నెమలి ఆనంద్, సీకే సర్సింగరావు, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్‌బాబు, వంశీకృష్ణ, మల్లేశ్, రఘునాథ్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, వికాశ్, నరేశ్, శ్రవణ్, బొజ్జ నర్సింగ్‌రావు, శ్రీలత పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం


సమావేశానికి హాజరైన నాయకులు

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీతో పాటు రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీదే విజయమని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ధీమా వ్యక్తం చేశారు. వారాసిగూడలోని రాచమల్ల కృష్ణమూర్తి ఫంక్షన్ హాల్‌లో బీజేపీ సీతాఫల్‌మండి డివిజన్ సమావేశం బుధవారం జరిగింది. ఆయన హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తిస్థాయి వ్యతిరేకత ఉందని, దానికి ఇటీవల వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శమన్నారు. మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కాలనీ, బస్తీ, కుల సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వాజపేయి నుంచి నేటి వరకు బీజేపీ చేసిన ప్రగతిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కందాడి నాగేశ్వర్ రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, పి.రవి ప్రసాద్ గౌడ్, అంబాల రాజేశ్వరరావు, ఆకారం రమేశ్, భాస్కర్ గిరి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


విందులో తలసాని, పద్మారావు, మహమూద్ అలీ

రాంగోపాల్‌పేట్: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నల్లగుట్టలో రహీం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రులు పద్మారావు, మహమూద్ అలీ, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మహేశ్ యాదవ్, అరుణ్‌బట్, కిరణ్ గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎన్నార్ శత జయంతి ఉత్సవాలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమ్మ సంఘం ప్రతినిధులు

అమీర్‌పేట: ఆంధ్రా నాటక పరిషత్ ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాలను ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ, ఆంధ్రానాటక కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాదరావు తెలిపారు. అమీర్‌పేటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అమీర్‌పేట కమ్మ సంఘం హాల్‌లో ఆరు నాటికలు, పద్య నాటకం ప్రదర్శిస్తారని చెప్పారు. మొదటిరోజు అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు సారపల్లి కొండల్‌రావుకు అక్కినేని జీవిత సాఫల్య సాధన పురస్కారం, 28న రావులపాలెంకు చెందిన సామాజిక సేవకుడు డా.గొలుగూరి వెంకట్‌రెడ్డికి ఆంధ్రా నాటక కళాపరిషత్ జీవిత సాఫల్య సాధన పురస్కారం అందజేస్తామన్నారు. ప్రతీరోజు సాయంత్రం 6.30 నుంచి ప్రదర్శించే నాటికలు, నాటకాలను ఎవరైనా వీక్షించవచ్చని పేర్కొన్నారు. అలాగే కమ్మసంఘం ద్వారా నాటక రంగానికి చేయుతనిచ్చే కార్యక్రమాలతో పాటు ఉచిత కంప్యూటర్, కూచిపూడి నృత్య శిక్షణ, ఉచిత వైద్య శాల నిర్వహిస్తున్నామని తెలిపారు.

యువకుడి అదృశ్యం

రాంగోపాల్‌పేట్: యువకుడు అదృశ్యమైన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగుట్టలోని పల్నాడు డైలీ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో గుంటూరుకు చెందిన ఓబులేసు డ్రైవర్‌గా, ఏసు రత్నం (27) క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20న ఉదయం 4 గంటల సమయంలో ఓబులేసు వాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా ఏసురత్నం వాహనం దిగి కనిపించకుండాపోయాడు. దీంతో ఓబులేసు సంస్థ యజమానికి సమాచారం అందించాడు. నగరంతో పాటు ఆయన బంధువులు, స్వగ్రామంలో విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ ఇన్‌చార్జి కాశీ రాజేశ్వరరావు గురువారం రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఆచూకీ తెలిస్తే రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో లేదా ఎస్ఐ గంగాధర్ నంబర్ 8712660183కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద

బొల్లారం: కంటోన్మెంట్‌లోని 8వ వార్డు పరిధిలో బోర్డు నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పైపులైన్ వల్ల సరస్వతీనగర్, సాయిబాబా కాలనీ, చింతబాయి, రుద్రనగర్ ప్రాంతాల్లో తానీనీటి సమస్య తీరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో 20 లక్షల గ్యాలన్ల నీటిని కంటోన్మెంట్‌కు కేటాయించాలని కోరారు. అనంతరం 8వ వార్డు అధ్యక్షుడు కింజరాపు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆమె బస్తీ బాట చేపట్టి స్థానిక కాలనీల్లో పర్యటించారు. డ్రైనేజీ, తాగునీరు, కాలనీ పార్కు ఏర్పాటు తదితర సమస్యలను స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, కిరణ్, జేవీ నర్సింగ్ రావు, ధనుంజయ్ చారి, సతీశ్ కుమార్, విజయ్ ఆనంద్, వేంకటేశ్వర కాలనీ ప్రెసిడెంట్ నాగేంద్ర, సరస్వతీకాలనీ ప్రెసిడెంట్ పుల్లరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

లాలాపేట: బ్లూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినోభానగర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది దాదాపు 150 మందికి సాధారణ చెకప్‌తో పాటు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్ విసంపల్లి క్రాంతి కిశోర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో వినోభానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు స్వామి, పరమేశ్, పద్మ, ఫౌండేషన్ కోఆర్డినేటర్ డానియల్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్ పదో నంబర్ ప్లాట్‌ఫాం సమీపంలోని ఓల్డ్ టికెట్ టెల్లర్ మెషిన్ ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటాయని తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మరిన్ని వివరాలకు 8712568581లో సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.

మల్కాజిగిరి అభివృద్ధికి 'మర్రి' కృషి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత వెంకన్న, తదితరులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు అన్నారు. బుధవారం మల్కాజిగిరి సర్కిల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకన్న ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీతాయాదవ్, నాయకులు జగదీష్‌గౌడ్, మురుగేష్, పరశురామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రావుల అంజయ్య, వెంకన్న మాట్లాడుతూ ఏడాదిలోనే నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే చెరగని ముద్ర వేశారన్నారు. అసెంబ్లీలో నియోజకవర్గానికి సంబంధించినవే కాకుండా రాష్ట్రంలోని సమస్యలను కూడా ప్రస్తావించారన్నారు. ఆర్‌యూబీల నిర్మాణం కోసం పలుమార్లు రైల్వే అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. అధికార పక్ష నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నా ఆయన వెనుకంజ వేయడం లేదన్నారు. సమావేశంలో చిన్నాయాదవ్, భాగ్యానంద్, నవీన్‌యాదవ్, సాయిగౌడ్, ఉస్మాన్, బాబూరావు, కాటం రాజు, శ్రీనివాసరెడ్డి, గడ్డమీదిరాజు,శేఖర్‌గౌడ్, బాలక్రిష్ణ, గుత్తి చందు,సూరి,వంశీ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించే అధికారులపై కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌సీ రవికిరణ్

సికింద్రాబాద్: అక్రమ నిర్మాణాలపై ఉదాసీన వైఖరి అవలంభించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ హెచ్చరించారు. తన కార్యాలయంలో సికింద్రాబాద్, బేగంపేట్ సర్కిళ్లకు చెందిన టౌన్‌ప్లానింగ్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రెండు సర్కిళ్ల కార్యాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నట్లు ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఇరువురు అసిస్టెంట్ టౌన్‌ప్లానర్లకు జడ్‌సీ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వెలసిన తాజా అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మళ్లీ ప్రజల నుంచి అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జోనల్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్ల టౌన్‌ప్లానింగ్ అధికారులు విఠల్, సుష్మిత, శ్రీనివాస్, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

అమీర్‌పేట: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట సత్యం టాకీస్ ఎదుట ఉన్న అమోగ హోటల్ వద్ద ఆన్‌లైన్‌లో ఐపీఎస్ మ్యాచ్‌ల బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న సమాచారంతో వెస్టుజోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. బేగంపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ నజీర్, అబ్దుల్ నయీం, బోరబండకు చెందిన ఎం.తాహిర్ అరెస్టు చేసి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పన్నులో రాయితీ కల్పించండి


సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసిన రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ సభ్యులు

కంటోన్మెంట్: రోడ్డు విస్తరణతో ఖాళీ అయిన వ్యాపార సముదాయాల ఆస్తి పన్నులో రాయితీకి కంటోన్మెంట్ బోర్డు అధికారులు సానుకూలంగా స్పందించడంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జాయింట్ యాక్షన్ చైర్మన్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌ను బుధవారం కలిశారు. ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా రాజీవ్ రహదారి విస్తరణకు నోటిఫికేషన్ జారీ కావడంతో, ఈ మార్గంలోని దుకాణాలు పెద్ద ఎత్తున ఖాళీ అవుతున్నాయి. ఓవైపు విస్తరణను కుదించాలని పోరాడుతున్న ఆయా భవన యజమానులకు ఆస్తిపన్ను చెల్లింపు భారంగా మారుతోంది. దుకాణాలు ఖాళీ అయి, కిరాయి లేనందున ఆస్తి పన్నులో రాయితీ ఇవ్వాలని బోర్డు అధికారులకు విన్నవించారు. దీంతో ఖాళీ దుకాణాలకు సంబంధించి ఆస్తి పన్నును 50 శాతం తగ్గించాలన్న బాధితుల విజ్ఞప్తికి సీఈఓ సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ చైర్మన్ సతీశ్ గుప్తా తెలిపారు. ఆయా దుకాణాలు ఖాళీ అయినట్లుగా ధ్రువీకరణతో పాటు గత ఎలక్ట్రిసిటీ బిల్లు, ప్రస్తుత బిల్లు అందించాలని, ఆస్తి పన్ను బకాయిలు లేని వారికి మాత్రమే రాయితీ వర్తింపజేస్తామని సీఈఓ స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు.

అక్కడ ప్రమాదం.. ఇక్కడ విషాదం


- రోడ్డు ప్రమాదంలో బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన ఇద్దరు యువకుల మృతి

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మంజు థియేటర్ సమీపంలోని మినర్వా గ్రాండ్ హోటల్ చౌరస్తా వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందగా, రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్నది. బీజేఆర్‌నగర్‌కు చెందిన ఎర్ర కనక మాధవ్, విజయలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు హర్షిత్ (20) అలాగే చాచానెహ్రూనగర్ నివాసి ఘంటాడి ఏడు కొండలు, విజయ కుమారుడు దేవీ ప్రణయ్(18) కూడా ఒక్కడే. చిన్నవయస్సులోనే యువకులు మరణించగా బాధిత తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వీరిలో ఒక్కరిది ఒక్కో గాథ.

హర్షిత్ చదువు మధ్యలోనే ఆగిపోవడంతో సోదరిని ఇంకా చదివించాలనే తపనతో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే ఆమెకు అండగా నిలుస్తున్నాడు. ఇటీవలే ఇంటర్ పరీక్షలు రాసిన సోదరిని ఉన్నత చదువు కోసం ఎంతో ప్రోత్సహిస్తున్నాడని కుటుంబీకులు చెప్పారు. తమ్ముడు మరణించాడనే వార్తను సోదరి జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపించడం కనిపించింది. హర్షిత్ తండ్రి మాధవ్ బండల పాలిష్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాగే చాచా నెహ్రూనగర్‌కు చెందిన ప్రణయ్ కూడా చదువు మధ్యలోనే ఆపేసి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండాలని హర్షిత్‌తో కలిసి పెస్ట్ కంట్రోల్ ఉద్యోగంలో మార్చి 1న చేరాడు. మంగళవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్తున్నానని ఉదయాన్నే వచ్చేస్తానని చెప్పిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడనే వార్తతో ఆ తల్లిదండ్రుల రోదనకు అంతులేకుండా ఉంది. ప్రణయ్ తండ్రి ఓ ప్రైవేట్ షాపులో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో హౌస్ కీపింగ్ పని చేస్తున్నట్లు సమాచారం.

బసంత్ సాహ్నీ ఆసుపత్రి వైద్యుల అరుదైన ఘనత


పాప తల్లిదండ్రులతో బసంత్ సాహ్నీ ఆసుపత్రి వైద్యుల బృందం

కంటోన్మెంట్: కేవలం 500 గ్రాముల బరువుతో పుట్టిన నవజాత శిశువును బతికించి సికింద్రాబాద్ బసంత్ సాహ్నీ ఆసుపత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. ఆసుపత్రి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాంధీనగర్‌కు చెందిన రామ్‌కుమార్, దీపాలి దంపతులకు మూడున్నర నెలల క్రితం శిశువు జన్మించింది. అప్పటికి 29 వారాల ప్రెగ్నెన్సీ మాత్రమే పూర్తి కావడంతో శిశువు బరువు 500 గ్రాములు మాత్రమే ఉంది. పాప బతికే అవకాశాలు అంతంత మాత్రమే అని ఇతర ఆసుపత్రుల్లో చెప్పడంతో చివరకు బసంత్ సాహ్నీ ఆసుపత్రిని సంప్రదించారు. శిశువును అడ్మిట్ చేసుకున్న వైద్యుల బృందం మెరుగైన చికిత్స అందించి శిశువును సాధారణ స్థితికి తీసుకువచ్చామని ఆసుపత్రి డైరెక్టర్ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో రామ్‌కుమార్, దీపాలి దంపతులు, ఆసుపత్రి వైద్యుల బృందం పాల్గొన్నారు.